# అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

వర్షం విడవకుండా కురుస్తోంది.


ఆకాశంలోని మేఘాలన్నీ అమరావతిని చుట్టుముట్టాయి. జోరున, భోరున కురుస్తున్న ఆ వర్షంలో మూడో ప్రాకారం మంటపంలోంచి వామనాచార్లు తదేకంగా పెద్ద బజారు వైపు చూస్తున్నాడు. కళ్ళు విచ్చుకు గాలిస్తున్నాడు మనిషి కోసం. పెద్ద బజారంతా జలమయంగా వుంది తప్ప జన సంచారం లేదు.

అప్పుడే పదకొండు గంటలు దాటింది. ఇంతవరకూ ఒక్క యాత్రికుడు రాలేదు. ఎవరో యాత్రికుడు రావాలి. అతగాడు అర్చన చేయించుకోవాలి. తనకో రూపాయి ఇవ్వాలి. ఆ రూపాయితో బియ్యం తెచ్చి వండితేనే స్వామికి నివేదనా, వామనయ్య దంపతులకు భోజనమున్నూ. వామనాచార్లు భార్య తాయారమ్మ కిందటి రాత్రే ఇన్ని అటుకులు, బెల్లం ఉడికించి విస్తట్లో వడ్డించి "ఈ పూటతో అటుకు లయిపోయాయి" అంది. బియ్యం నిండుకున్నాయి సరేసరి రేపటికి అటుకులు కూడా లేవని అర్థమయింది వామనాచార్లుకి.

అందుకే ఉదయం నుంచి యాత్రికుల కోసం ఎదురు చూస్తున్నాడు. వర్షం తగ్గేట్టు లేదు. "ఇంత తుపానులో భక్తులెవరొస్తారు?" వామనాచార్లు ఆశగా పెద్ద బజారు వంకే చూస్తున్నాడు. దూరంగా రెండు గొడుగులు-ఆచార్లు కళ్ళల్లో ఆశ, "కూర లేకపోతే ఫర్వాలేదు, పచ్చడేసుకు తినొచ్చు!" గొడుగులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. "అమ్మ! ఒకళ్ళు కాదు ఇద్దరు! రెండు రూపాయిలు దొరికితే ఇవాళ్టికే కాదు. రేపటి గురించిన చింత కూడా వుండదు" గొడుగులు ఇంకా ముందుకొచ్చి చటుక్కున ఇళ్ళల్లోకి దూరిపోయాయి. వాళ్ళు యాత్రికులు కాదు. వామనాచార్లు కుంగిపోయి చతికిలపడ్డాడు.

పన్నెండు దాటుతోంది. వామనాచార్లుకి ఆశ సన్నగిల్లుతోంది. నీరసం వస్తోంది. "వేణుగోపాలా! నీకు ఇంత వర్షంలో గన్నేరు పూలు తీసుకొచ్చి పూజ చేశానే! మందార మాల అల్లి మెళ్ళో వేశానే! దానికి ఫలం నాకు వస్తే?" అనుకున్నాడు. అంతలో పెద్దబజారు చివర్న ఒక గొడుగు. వామనాచార్లు కళ్ళు ఆశగా చూశాయి. గొడుగు మరీ దగ్గరకొస్తోంది. చేతిలో సంచి. తప్పకుండా యాత్రికుడే! గొడుగు గాలిగోపురం దగ్గరకొచ్చింది. అంత వర్షాన్ని లెక్క చెయ్యకుండా వామనాచార్లు మెట్లు దిగి రయ్యిన పరుగెత్తుకొచ్చాడు. ఆ యాత్రికుడు కొబ్బరికాయలు కొంటుంటే "అయ్యవారి గుళ్ళో ఒకటి, అమ్మవారి గుళ్ళో ఒకటి, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి కూడా ఇంకో కొబ్బరికాయ తీసుకోండయ్యా" అన్నాడు.

ఆ యాత్రికుడు రెండు కొబ్బరికాయలు, పళ్ళూ తీసుకొని ముందుకు నడుస్తుంటే అతని వెనకాలే "క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి పై ప్రాకారంలో నండయ్యా" అంటున్నాడు వామనయ్య. ఆ యాత్రికుడు ప్రదక్షిణం చేస్తుంటే వెంట వెంటనే అంటిపెట్టుకు తిరుగుతూ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి గుడి ఇదేనండయ్యా" అన్నాడు. "పెద్ద గుళ్ళోకి వెళ్ళి రానివ్వండి" అని ఆ యాత్రికుడు అమరేశ్వరుడి దగ్గరకి వెళ్ళినా వామనయ్య అతన్ని వదల్లేదు. అయ్యవారి గుళ్ళో పూజయ్యే దాకా పక్కనే వున్నాడు.




రెండు కొబ్బరికాయలు అక్కడే కొట్టేశాడు అయ్యవారి గుళ్ళో అర్చకుడు. మిగిలిన రెండు పళ్ళూ అమ్మవారి గుళ్ళో ఇచ్చాడు యాత్రికుడు. నివేదనకు లేకపోతే లేకపోయింది. "క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి కొంచెం కర్పూరం వుంచండయ్యా" అని వామనయ్య వేడుకోగా కొంచెం కర్పూరం మిగిల్చాడు యాత్రికుడు. అక్కడ పూజ కాగానే "క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి గుడి ఇటు రండయ్యా" అని దోవ చూపిస్తూ వేణుగోపాల స్వామి గుళ్ళోకి తీసుకొచ్చాడు యాత్రికుణ్ణి.

'అర్చన చేస్తా'నన్నాడు వామనయ్య.

'వొద్ద'న్నాడు యాత్రికుడు.

'పోనీ మంత్రపుష్పం' అన్నాడు వామనయ్య.

అయినా సరే గోత్ర నామాలతో అర్చన చేసి మహాభక్తితో హారతిచ్చాడు వామనయ్య. ఆ యాత్రికుడు సంతోషించి అర్థరూపాయి పాదుకల పళ్ళెంలో వేశాడు. "పోన్లే! ఒక పూట ముద్ద పెట్టాడు స్వామి" అని తృప్తిపడ్తున్న వామనయ్యకి పెద్ద గుళ్ళో గంట మోగటం విన్పించింది. ఇంకో యాత్రికుడేమోనని ఆశపడ్డాడు వామనయ్య. ఇంతలో "వానయ్యేది వరదయ్యేది దేవుణ్ణి చూడకుండా భోంచెయ్యనుగా!" అన్న చిల్లర కొట్టు సుబ్బయ్య గొంతు విన్పించింది.

వేణుగోపాలస్వామి గుళ్ళో కొస్తూనే "స్వామీ" అని గంట మోగించి చేతులు జోడించి నిలబడ్డాడు సుబ్బయ్య. వామనయ్య పాదుకల పళ్ళెం తీసుకొచ్చి పాదుకలు సుబ్బయ్య తల మీద పెట్టడంతో పళ్ళెంలో అర్థ రూపాయి తళుక్కున మెరిసింది. తులసి దళం కోసం చేయి జాపవలసిన సుబ్బయ్య చటుక్కున ఆ అర్థరూపాయి లాక్కుని బొడ్లో దోపుకుని బాకీలో జమేసుకుంటానని వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు. వామనయ్య వూరందరిలాగే ఉప్పు, పప్పు సుబ్బయ్య దగ్గర అప్పు తెచ్చుకుంటాడు.

వామనయ్య తెల్లబోయాడు. దిమ్మరపోయి తూలి పడబోయి ద్వారపాలకుడి పక్కనే చతికిలపడ్డాడు. కొంత సేపటికి పెద్ద గుళ్ళో నైవేద్యాలు జరుగుతున్న గంటలు విన్పిస్తే అందులో ఓ అర్చకుణ్ణి పిల్చి "ఇవాళ మా ఇంట్లో ఇబ్బందయింది. వేణుగోపాలస్వామి గుళ్ళో కూడా నివేదన పెట్టమ"ని అడిగాడు. అతగాడు నివేదన పూర్తిచేసి వెళ్ళినా వామనయ్య అక్కణ్ణించి కదల్లేదు.

కొంతసేపటికి ఆగని ఆ వర్షంలోనే తడుస్తూ, నీరసంగా ఇంటికొచ్చాడు. తాయారమ్మ తులసి పూజ చేసుకుని ఇంట్లో కొస్తోంది. భర్త చేతిలోనూ ఏమీ లేదు, చెంగునా ఏమీ లేదు. పీట వాల్చుక్కూర్చోవలసినాయన మంచం వాల్చుకోవటంతో అర్థమయిందామెకు. వామనయ్య దగ్గరకొచ్చి తీర్థం ఇచ్చి నాలుగు తులసి దళాలు వామనయ్య చేతిలో పెట్టింది. చెవుల్లో పెట్టుకోవలసిన తులసి దళాలు వామనయ్య నోట్లో వేసుకుని నమలటం మొదలెట్టాడు. ఎదురుగా స్తంభాని కానుక్కూర్చుని తాయారమ్మ కూడా తులసిదళాలు నములుతోంది. వాళ్ళు దళాలు ఎలా నములుతున్నారంటే సుష్టుగా పిండి వంటలతో భోంచేసి తృప్తిగా తాంబూలం నమిలినట్టు నములుతున్నారు.

అలా నములుతూ ఒకళ్ళని చూసి ఒకళ్ళు నవ్వుకున్నారు. వామనయ్య 'గోపాలా' అంటే, తాయారమ్మ 'వేణుగోపాలా' అంది. తులసి దళాలు నమలగా నమలగా వాళ్ళ నోళ్ళు పండాయి.